శతజయంతి

ప్రముఖ కథానిక, నవలా రచయిత, చిత్ర దర్శకులు గోపీచంద్ సెప్టెంబరు 8, 1910లో పుట్టారు. తెలుగు కథానిక కూడా అప్పుడే పుట్టింది వైవిధ్యం, విలక్షణమైన శైలి జోడించి పలు కథానికలు రాశారు గోపీచంద్. మెరుపుల మరకలు, చీకటి గదులు, పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా వారి నవలలు. అసమర్థుని జీవితయాత్ర వారి మాగ్నమ్ ఓపస్‌గా చెబుతారు. ప్రపంచ ప్రసిద్ధులైన తత్వవేత్తల తత్వాలను సరళీకరించి వ్యాసరంపరను వెలువరించారు.

సెప్టెంబరు 8 నుంచి ఏడాదిపాటు గోపీచంద్ జయంతి ఉత్సవాలు జరపడానికి సన్నాహాలు చేస్తున్నారు. గోపీచంద్ సాహితీ సర్వస్వాన్ని పదిసంపుటాలుగా వెలువరిస్తారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలుచోట్ల గోపీచంద్ జయంతి ఉత్సవాలు జరపనున్నారు. న్యూయార్క్, డెట్రాయిట్ నగరాలలో కూడా ప్రవాసాంధ్రులు గోపీచంద్‌ని సంస్మరించుకోనున్నారు. ఈ సందర్భంగా గోపీచంద్ కథని పత్రిక పాఠకులకు అందిస్తున్నాం.

# ఆశీర్వచనం

**వెం**కటరమణశాస్త్రి సద్బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాడు. అయితే అతనికి చిన్నప్పుడు మృదంగం నేర్చుకోవాలనే కుతూహలం ఉండేది. ఆ కుతూహలంతో, అన్న చెపుతున్నా వినక దక్షిణాది వెళ్ళి పది సంవత్సరాలు గురు శుశ్రూష చేసి నేర్చుకున్నాడు. మృదంగం బాగానే వాయిస్తాడు గాని, బుద్ధిలో ఉన్న పెంకితనం వల్ల, పాడే సంగీత విద్వాంసుడికి మధ్య మధ్య పెడ తిరుగుతూ ఉంటాడు. అందువల్ల సకృత్తుగా తప్ప ఏ గొప్ప సంగీత విద్వాంసుడూ అతన్ని తన పాట కచ్చేరీకి పిలిపించేవాడు కాదు. పిలిపించినవారికి సభ పూర్తి అయ్యే వరకూ, ప్రాణాలు కొట్టుకుంటూనే ఉండేవి

అయితే మనిషి చెడ్డవాడా అంటే కాదు. ఇప్పటికీ స్నానం చేసి, మొహానికి గంధం రాసి, కుంకుంబొట్టు పెడితే బ్రహ్మవర్చస్సు ఉట్టిపడుతూ ఉంటుంది. అతని అరవయ్యోపడిలో అతనికి నాకూ పరిచయం అయింది. అప్పటికి అతను ప్రభుత్వంవారు స్థాపించిన సంగీత విద్యాలయంలో మృదంగిస్టుగా ఉంటున్నాడు. నేను దానికి దగ్గర్లో ఉన్న హైస్కూల్లో మాష్టారుగా ఉంటూ ఉండే వాణ్ణి. నేను మొదటి నుంచీ ఆ హైస్కూల్లో మాష్టారును కాదు. మరొక స్కూలు నుంచి అక్కడికి ట్రాన్స్‌ఫర్ అయ్యాను.

ఒకరోజు వెంకటరమణశాస్త్రి, 'దినపత్రిక ఉంటే ఒకసారి ఇస్తారు?' అంటూ నా గదికి వచ్చాడు. ఇచ్చాను. కూర్చుని తీరిగ్గా చదువుకొని వెళ్ళిపోయాడు. ఆరోజు మొదలుకొని రోజూ పత్రిక చదువుకోటానికి వస్తూండేవాడు. ఈవిధంగా పరిచయం అయి, ఆ పరిచయం క్రమక్రమేణా స్నేహంగా వృద్ధి చెందింది.

వెంకటరమణశాస్త్రికి వేదాంతంలో కొద్దిగా పరిచయం ఉంది. నాకప్పుడు సర్వీస్‌లో రావలసిన ప్రమోషన్ రాక, కాస్త వేదాంత దృష్టి అలవడి ఉంది. అందువల్ల పత్రికల్లో ఉన్న విషయాలతోపాటు వేదాంతాన్ని గురించి మేము ఎక్కువగా మాట్లాడుకుంటూ ఉండే వాళ్ళం. వేదాంత విషయం ఏది చర్చకు వచ్చినా నశ్యం తానింత తీసుకుని, నాకొక పట్టు ఇచ్చి, పీల్చి, నన్ను పీల్చమని సంభాషణకు ఉపక్రమించేవాడు.

అతను వేదాంతంలో కృషి చెయ్యకపోయినా, వంశపారం పర్యా వచ్చిన జ్ఞానంవల్లా, అనుభవం వల్లా వేదాంతంలో ఒక స్థాయికి వచ్చిన మనిషి. నేను చదవటానికైతే చాలా పుస్తకాలు చదివాను గాని, అనుభవం,

# జనానా

అనుష్ఠానం తక్కువ. అందువల్ల మా సంభాషణ ఒకరి కొకరికి సహాయకారిగా ఉండేది. పరిచయం అయిన కొద్ది రోజులకే, మా స్నేహం దృఢపడటానికి ఇది ముఖ్య కారణం.

ఒకరోజు అతను మామూలుగా నా గదికి వచ్చి ఆనాటి దినపత్రిక అడిగాడు. నేనిచ్చాను.

అతను పత్రిక పేజీలు తిరగేస్తూ, ఒక చోట ఆగి, ''పాపం'' అని ఒక పెద్ద నిట్టూర్పు విడిచాడు.

''ఏమిటి సంగతి?'' అని నేను అడిగాను.

''మహమ్మదలీ సాహెబుగారు మరణించారు, చూడలేదా?'' అన్నాడు శాస్త్రి.

ఆ వార్త నేను చూశాను. కాని అంత విలువ ఇవ్వ లేదు. అతను ఆ వార్తకు ఎందుకు అంత విలువ ఇస్తు న్నాడో కూడా నాకు అర్థం కాలేదు.

మహమ్మదలీ సాహెబుగారు ఒక పెద్ద జాగీర్దారు కొడుకు. అప్పుడు మేము ఉంటున్న ఊరు ఆ జాగీర్లదే. ఇటీవలే ఆ జాగీర్ని ప్రభుత్వం తన పరం చేసుకుంది. అయితే అతని మరణానికి వెంకటరమణశాస్త్రి విచార పడటం దేనికి? ఈమాటే అతన్ని అడిగాను.

''నేను ఆయన కొలువులో కొన్నాళ్ళు మృదంగం

## 'డే'ల గోల!

'బర్త్‌డే'... 'మేరేజ్'డే
వాడవాడలా 'మేడే'
అదనంగా అప్పుతెచ్చుకున్నవి
'వాలెంటైన్స్' డే నాడు
ప్రేమజంటలకు ఫుల్‌ఫ్రీడం!
ఫాదర్స్‌డే నాడు
తండ్రికి కౌగలింతలే
పాదపూజలుండవ్!
మదర్స్‌డే నాడైనా
చంకపిల్లలకు
తల్లులు పాలివ్వరు!
బెగ్గర్స్ డే రోజున
అన్నదానాలు... సంతర్పణలు!
గ్రాండ్ ఫాదర్స్ మదర్స్ డే
నాడు ఓల్డేజిహోములో
పండ్లు బిస్కెట్లు పంపిణీ!
చిల్డ్రన్స్ డే రోజున
కవ్వింతలు... కేరింతలు
విరిసే నవ్వుల జల్లులు
బాలల చాచాస్మరింపు!

అల్లుళ్ళ డే నాడు
అత్తమామలకు అప్పులడే!
గాడ్స్ డే (సారీ గాడ్సే కాదు) నాడు
కొండకెళ్ళి గుండు గీకించుకుని
స్వామి దర్శనం! ప్రసాద సేవనం!
'డే'ల గోల మనకేల...
అనుకోలేము!
అంతా ఇంపోర్టెడ్ కల్చరే!
స్వదేశీ సాంప్రదాయాలకు
శాశ్వతంగా తిలోదకాలు!
అందుకే సామెత...
ఒక కాకి అరిస్తే
అన్నీ 'కావు-కావు' అంటాయి?
అంతా కాకిగోల
మోడరన్ డేస్‌లో
ఏ'డే' ఎప్పుడొచ్చినా
'డే'లకు 'జేజే'లు
అనవసరపు అధిక
ఖర్చుతో జేబుకు చిల్లులు!
ఈ'డే'లకు 'గాడ్‌ఫాదర్' ఎవరో??

ఎస్.వివేకానంద

వాయించాను. చాలా మంచి మనిషి'' అన్నాడు.

మహమ్మదలీ సాహేబు మంచి మనిషి అనగా వినటం నాకదే మొదటిసారి. ఆయనకూ ఆయన తండ్రి గారికీ ప్రజల్లో ఏమాత్రం మంచిపేరు లేదు. వారు చేసిన దౌర్జన్యాలను గురించీ, వారి జనానాలను గురించీ, ప్రజలు చిత్ర విచిత్రమైన కథలు చెప్పుకోవటం నేను ఎరుగుదును. అటువంటి మహమ్మదలీ సాహేబుని మంచి మనిషి అంటున్నాడు వెంకటరమణశాస్త్రి. తేలిగ్గా అభిప్రాయాలను ఏర్పరచుకునే మనిషి కూడా కాదు.

## నానీలు

గ్రీష్మ తాపంలో
మ్రగ్గిన ఆ వృక్షం
వర్షాకాలంలో
అభ్యంగన స్నానం చేస్తుంది!

ఆకాశం
మేఘావృత హర్షిత
హృదయమై రాల్చే
ఆనందబాష్పాలు! వర్షం!!

ఆచ్ఛాదనలేని
పేద వెన్నులో
వణకు పుట్టించే
చలిపులి! శిశిరం!!

వర్షపు జల్లుపై
రవికిరణశోభ
అంబరంలో విరిసే
ఆ హరివిల్లు!

రాత్రివేళల్లో
వెలిగే నక్షత్రాలు!
కీర్తిశేషుల
కాంతిరూపాల దీపాలు!!

కొడవలి సత్యనారాయణ

విషయం సమగ్రంగా తెలుసుకోవాలనిపించింది నాకు.

''నువ్వు ఆయన కొలువులో ఉద్యోగం సంపాదించడం ఎలా సంభవించింది?'' అని అడిగాను.

అతను నెమ్మది నెమ్మదిగా కథంతా చెప్పాడు.

ఆరోజుల్లో వెంకటరమణశాస్త్రి మృదంగం విద్య నేర్చుకొని ఏ పనీ పాటా లేకుండా తిరుగుతుండేవాడు. అన్నగారి మంకుతనంవల్లా, తన దిమ్మరితనంవల్లా ఉన్న ఆస్తి అడుగంటింది. అప్పటికే అతనికి నలుగురు పిల్లలు. అందులో భార్య కొంచెం రజోగుణం గలది అవటం వల్ల ఇంట్లో ఉండటం క్షణక్షణ గండంగా పరిణ మించింది. శాస్త్రిది అసలు సర్కారు జిల్లాల్లో ఒక కుగ్రామం. సర్కారు జిల్లాల్లో అతనికి పరిచితులూ, స్నేహితులూ చాలామంది ఉన్నారు. గాని ఏ ఒక్కరూ అతనికి సహాయం చెయ్యలేక పొయ్యారు.

సర్కారు జిల్లాల్లో ఉద్యోగం దొరకని వారు హైదరాబాద్ వెళ్ళటం రివాజు. అద విధంగా వెళ్ళాడు శాస్త్రి. అక్కడ ఆయన తిరగ్గా తిరగ్గా తనలాగే వచ్చి ఉద్యోగం సంపాదించుకొని, సుఖంగా జీవయాత్ర సాగిస్తున్న ఒక పాత చుట్టం కనిపించాడు. ఆయన మహమ్మదలీ సాహేబు గారి దగ్గర మేనేజరుగా ఉన్నాయనను ఎరుగును. వెంకటరమణశాస్త్రిని ఆయన దగ్గరకు తీసుకొని వెళ్ళాడు.

అప్పటికి ఇంకా హైదరాబాద్ భారత ప్రభుత్వం క్రిందికి రాలేదు. నైజామే పరిపాలిస్తూ ఉండేవాడు. జాగీర్దార్ల పని అతి వైభవంగా ఉండేది. మహమ్మదలీ సాహేబు గారి తండ్రి బంజారా కొండలమీద ఉండేవారు. మహమ్మదలీ సాహేబు సైఫాబాద్‌లో ఒక పెద్ద భవనంలో ఉంటూ ఉండేవాడు. వారానికి ఒకసారి ఉదయం వెళ్ళి, తండ్రితో భోజనం చేసి వస్తుండేవాడు. అంతకంటే ఆయనకూ తండ్రికీ ఎటువంటి సంబంధమూ ఉండేది కాదు.ఎవ్వరి జీవితం వారిదిగా ఉండేది. అయితే తండ్రి కుమారునికి నెలకు ఇంతని డబ్బు మాత్రం పంపుతూ ఉండేవారు. మహమ్మదలీ గారు ఆ డబ్బూ, సొంత ఆస్తిమీద వచ్చే డబ్బూ ఖర్చుపెట్టడమే గాక, అప్పుకూడా చేస్తూ ఉండేవారు. ఇతర ఖర్చులమాట అటుంచి వారి జనానాలో వందమంది ఉంటూ ఉండేవారు.

రెండువందలకు పైగా గుర్రాలూ, ఏనుగులూ ఉండేవి. మద్యపానం, నృత్య సంగీతాలు అహర్నిశలూ జరుగుతూ ఉండేవి. ఆయన భవనం ఒక ఇంద్రభవనంగా ఉండేది.

# ఏ గింజమీద రైతు పేరుండదు

'ఏ గింజమీద రైతు పేరుండదు
అన్ని బస్తాలమీద వ్యాపారి పేరే!'
శ్రమ దోపిడి అంటే ఇదేనా!
'రైతే రాజు!
దేశానికి వెన్నెముక రైతు!
జై జవాన్, జై కిసాన్!
ఎంత మంచి పొగడ్తలు!
365 రోజులు రెక్కలు ముక్కలు చేసుకొంటే కూలి
పైసలిక్కడ గిట్టవు!
భూమి మీద ప్రేమ కదా!
భుక్తికోసం బతుకు కదా!
ఆరుగాలం కష్టపడి .
చేతికొచ్చిన గింజల్ని అమ్ముదామంటే కూడా
అక్కడ కూడా పడిగాపులే రోజుల తరబడి
అంతా దోపిడి!
క్వింటాలుకు తొమ్మిది వందలు, వెయ్యి వరకు పలికే
వడ్లు
క్వింటాలుకు మూడువెయిల వరకు పెరుగుతుంటే!
ఎక్కడ లాభం? ఎవరికి లాభం?
ఎవరిది దోపిడి? ఎక్కడ నియంత్రణ?
'రైతూ, రైతూ నీ వడ్లు కొనేవాళ్ళెవరు?'
'రైతూ, రైతూ నువ్వు వడ్లు పండించకుంటే
వీళ్ళు ఏం తిని బతుకుతారు?'
వీళ్ళ కంప్యూటర్లు, వీళ్ళ కర్మాగారాలు,
వీళ్ళ కాగితాల లెక్కలు
పిడికెడు బియ్యం గింజలు పుట్టించవు కదా!
నువ్వు భూమీ మీద ప్రేమతోనా,
భుక్తి గడువడం కోసమా!
రెక్కాడితేగాని డొక్కాడని
బతుకు బతుకుతున్నావు!
రైతుకు కరెంటు కావాలి
రైతుకు నీళ్ళు కావాలి!
కరెంటు, నీళ్ళు సరిగా ఇవ్వని దశలో
వీళ్ళు పంటల్నెలా పండిస్తారు?
కరెంటు లేక నీళ్ళందక
వాడిపోయిన పంటపొలానికి
స్వయంగా నిప్పుపెట్టె రైతుల కళ్ళల్లోని దైన్యం
ఎవరికి కనిపిస్తుంది!
నాయకులారా! రైతు రాజ్యం కావాలంటారా?
అన్నవెూ రామచంద్రా! అని ఇంకా
అలమటించమంటారా?
ఈ దేశంలో!
నిజంగా రైతే రాజు! ఎప్పటికీ!
రైతును ఆదరించండి, నిజాయితీతో

*సబ్బని లక్ష్మీనారాయణ*

ఇవన్నీ హైదరాబాద్‌లో ఆబాలగోపాలానికీ తెలుసు. హైదరాబాద్‌లో అడుగుపెట్టిన కొద్దిగంటలకే ఈ విషయాలన్నీ వెంకటరమణశాస్త్రి చెవికెక్కినై. మామూలు పరిస్థితుల్లో అయితే అటువంటి మహమ్మదలీ సాహేబు దగ్గర పనిచెయ్యటానికి వెంకటరమణశాస్త్రి అంగీకరించి ఉండేవాడు కాదు. కాని ఇప్పుడు ఏదో ఒక ఉద్యోగం చెయ్యటం కంటే గత్యంతరం లేక అంగీకరించాడు.

మంచిరోజు చూచి వెంకటరమణశాస్త్రిని ఆ పాత బంధువు, మేనేజరు దగ్గరకు తీసుకువెళ్ళాడు. మేనేజరు మహమ్మదలీ సాహేబుగారి దగ్గరు తీసుకువెళ్ళాడు. వెంకటరమణశాస్త్రి వాయిద్య నైపుణ్యం, ఉన్నదానికంటే వెయ్యిరెట్లు ఘనతగా చెప్పాడు. మహమ్మదలీ సాహేబుగారు వెంకటరమణశాస్త్రిని మరునాటి నుంచి ఉద్యోగంలో చేరమన్నాడు.రోజూ సాయంకాలం ఆరుగంటలకు వచ్చి తొమ్మిదిగంటలకు వెళ్ళిపొమ్మన్నారు.

మరునాడు వెంకటరమణశాస్త్రి కొలువులో ప్రవేశించాడు. కాని పనేమీ ఉండేదికాదు. ఏ కాసేపో, గుణం కుదిరితే, మృదంగం వాయించమనేవాడు. మహమ్మదలీ

## లయ విన్యాసం...

జీవితంలో సంభవించే సంఘటనలు
కొన్ని వినోదాన్ని కలిగిస్తే..
కొన్ని విషాదాన్ని విరజిమ్ముతాయి...!
కర్మను అనుభవించాలన్నదే విధాత నిర్ణయం...
విచిత్ర సమస్యల వలయం బ్రతుకు సమరం...!
బాధలు, గాధలు, వ్యధలు వాటిని...
కథలుగా కొందరు విచిత్రంగా విశ్లేషిస్తే...
అవి ఆత్మీయులకు తీపిజ్ఞాపకాలు...!
పెద్దల అనుభవాల, సుభాషితాల సారాంశాలు..
అవి పిన్నలు నేర్చుకునే అక్షర సత్యాలు...!
వాటిని విని ఆచరించే వారి మనోభావాలు..
మన నైతిక జీవన ప్రవంతికి అవి జ్ఞాన దీపికలు...!
మనలో నిగూఢమైన ఆదర్శాలు, ఆశయాలు...
వాటిని సాధించాలనే తపన నేటి యువత కర్తవ్యం...!
విజయాలను వరించిన వారంతా ప్రతిభా వంతులు...
మమతానురాగాలను పంచిన వారే మహ నీయులు...!
సోదర భావం, సహజీవనం మనందరి ధ్యేయం...
సర్వమత సామరస్యం భారతీయుల విలక్షణ లక్ష్యం...!
అదే సగర్వంగా నిరూపించే మన ఆధ్యాత్మిక తత్వం...
మన సనాతన సంప్రదాయానికి అది ప్రతి రూపం...
భరతమాత హృదయంలో ప్రతిధ్వనించే...
అదొక అపూర్వ స్వర, రాగ, లయ విన్యాసం...!!

*తంగెళ్ళ పాండురంగ శర్మ*

సాహెబుగారికి ఖైర్వావరుసలు ఇష్టం. అవే వాయించ మనేవాడు. శాస్త్రీ అలాగే వాయించేవాడు. కాని మృదంగం తాను వాయిస్తున్నప్పుడల్లా తలుపు పక్కనుంచి ఒక యువతి ఆపేక్షగా వింటూ ఉండడం అతను గమనించక పోలేదు. ఆమె పేరు మనోహరి. జనానాలో ఉండే యువ తుల్లో ఆమె ఒకతె. మహమ్మదలీ సాహెబుగారికి చాలా ఇష్టురాలని ప్రతీతి.

అలా జరిగిపోయినై కొన్ని రోజులు. రోజులు గడిచిన కొద్దీ మహ్మదలీ సాహెబుగారితో వెంకటరమణశాస్త్రికి బాగా చనువు ఏర్పడింది. అలా చనువు ఏర్పడటానికి వేదాంతం తోడ్పడింది. మహమ్మదలీ సాహెబుగారికి హిందూ వేదాంతం అంటే ఇష్టం. అందుకని ఏవేవో ప్రశ్నలు వేస్తూ ఉండేవారు. భాగవతంలోని పద్యాలు చది వించుకొని సంతోషిస్తూ ఉండేవారు. వారి భవనం పక్కన ఉన్న రామాలయానికి ధూపదీపనైవేద్యాలకు ఖర్చు మహమ్మ దలీ సాహెబుగారే భరిస్తూ ఉండేవారు.

అప్పుడప్పుడూ తన సొంత విషయాలు కూడా చెపుతూ ఉండేవారు. ఆమధ్య తండ్రిగారికీ, ఆయనకూ పొరపులు వచ్చినై. జాగీర్లు ఎక్కువ కాలం ఉండవని తెలుసుకొని తండ్రిగారు చాలా డబ్బు పోగు చేశారు. ఖర్చంతా తగ్గించి వేశారు. తన వద్ద ఉన్న దాసదాసీ జనా నికి వివాహాలు చేసి పంపించి వేశారు. కుమారుడు కూడా అదే విధంగా చెయ్యాలని వారి ఉద్దేశ్యం. కాని మహమ్మ దలీ సాహెబుగారు అందుకు ఒప్పుకోలేదు. దానితో నెలనెలా వారిచ్చే డబ్బు మానివేస్తానని తండ్రిగారు బెది రించారు. ఇటువంటి విషయాలన్నీ శాస్త్రికి చెబుతూ ఉండేవారు.

''మా తండ్రి రక్తంలో జాగీర్దారీ రక్తం లేదు. ఒట్టి కోమటి. మా తండ్రిగారి చిన్నతనంలో మా తాతగారు వారిని ఒక ఉత్సవానికి వెంట తీసుకువెళ్ళారు. ఊరేగింపు సమయంలో మా తండ్రిగారి జేబురుమాలు కింద పడింది. ఆయన దాన్ని తీసుకుని మళ్ళీ జేబులో పెట్టు కున్నారు. అందుకు మా తాతగారికి కోపం వచ్చి వీడు జాగీరు పరిపాలించడానికి అర్హుడు కాడని చెప్పి రాజధాని బయట ఒక భవనం కట్టించి అందులో పెట్టారు'' అని చెప్పేవారు.

''మరి తండ్రిగారు పరిపాలనకు ఎలా వచ్చారు హుజూర్'' అని అడిగాడు వెంకటరమణశాస్త్రి.

''మంత్రిగారి సహాయంతో శాస్త్రీజీ!'' అన్నారు మహమ్మదలీ సాహెబుగారు. ఇంకా ఇలా చెప్పారు.

''మా తాతగారికి మామూలు భార్యల సంగతి అటుంచి, ముఖ్యులు ఇద్దరు ఉండేవారు. అందులో పెద్ద భార్య సంతానం మా తండ్రి గారు. రెండవ భార్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు చాలా దర్పం గల వారు. అందులో పెద్దవాడు నిజంగా పరిపాలను అర్హుడు. తన తరువాత జాగీరు పరిపాలనకు వారే రావాలనే మా తాతగారి అభిలాష. కాని మా తాతగారి అనంతరం, మంత్రిగారు మా తండ్రిగారి వద్ద చాలా డబ్బు తీసుకొని, మా తాతగారి కోర్కెకు వ్యతిరేకంగా, వారు వ్రాసిన ఫర్మానాను మాపుచేసి మా తండ్రి గారిని గద్దె ఎక్కించారు''

''మరి మీ తాతగారి రెండవభార్య కుమారులు ఇప్పుడేం చేస్తున్నారు హుజూర్?'' అని ధైర్యం చేసి అడిగాడు శాస్త్రి.

''వీధులు పట్టుకు తిరుగుతున్నారు శాస్త్రీజీ. మా తండ్రి గారు కోమటి అని చెప్పాను గదా! వారికి ఏమీ ముట్టకుండా చేశారు. అప్పుడప్పుడూ నేనే వారికి కొద్దీ గొప్పా డబ్బు పంపుతూ వుంటాను. సంగతి తెలిస్తే మా తండ్రిగారు ఊరుకోరు. నాకిచ్చే డబ్బు కూడా ఆపుజేస్తారు. అందుకని ఈ విషయం రహస్యంగా ఉంచాను. ఆ బిడ్డలు కూడా మా తండ్రిగారి తోటి వాళ్ళే గదా, వారిని అలా చెయ్యటం అన్యాయం చెయ్యటం కాదా శాస్త్రీజీ? భగవంతుడు ఊరుకుంటాడా?'' అని అడిగారు మహమ్మదలీ సాహేబుగారు.

ఏమంటే ఏమవుతుందోనని ''భగవంతుని లీలను గ్రహించటం కష్టం హుజూర్'' అన్నాడు శాస్త్రి.

మహమ్మదలీ సాహేబుగారు కాసేపు మౌనంగా కూర్చున్నారు. చివరికి ''ఏదైనా మా తండ్రిగారిలో జాగీర్దారుల రక్తం లేదు. ఆయన ఒట్టి కోమటి. కోమటని నేను మాట వరుసకు అనటం లేదు శాస్త్రీజీ. మా ముత్తవ్వకు అసలు పిల్లలు లేరు, అందువల్ల జాగీరు తన సవతి పిల్లలకు ఎక్కడ వెళ్తుందోనని భయపడి, ఎవ్వరికీ, చివరికి మా తాతగారిక్కూడా తెలియకుండా కోమట్ల పసిపాపను తెచ్చుకొని తనకు పుట్టిన పిల్లవాడుగా నటించి పెంచిందని ఒక ప్రబలమైన వదంతి ఉంది. మా తండ్రిగారి చర్యలు చూస్తుంటే ఇది నిజమేనేమోనని అనిపిస్తూ ఉంది, శాస్త్రీజీ'' అన్నారు.

శాస్త్రి మహమ్మదలీ సాహేబు తండ్రిగారి పిసినిగొట్టుతనాన్ని గురించి అంతకుముందే అనేక కథలు విని ఉన్నాడు. ఆ మాటకి వస్తే హైదరాబాద్‌లో ఈ విషయం తెలియని పౌరుడంటూ లేదు. వారు బేడకు పది సిగరెట్లు ఇచ్చే చార్మినార్ సిగరెట్లు మాత్రమే తాగుతారు. వాటిని కూడా చౌక అని ఫ్యాక్టరీ నుంచి పెద్ద మొత్తంగా ఒకేసారి తెప్పిస్తారు. కుడితినీలు చిరిగితే, అవే కుట్టించుకొని తొడుగుకుంటారు. మిషన్ వాడి దగ్గరకు పంపితే, కను చాటవటంవల్ల సరిగ్గా కుట్టడేమోనని, మిషన్‌వాడిని మిషిన్‌తో సహా పిలిపించి తన పర్యవేక్షణ కింద చిరుగులు కుట్టించి తొడుక్కుంటారు. అంతేకాదు తన కింద ఉన్న చిన్నచిన్న జాగీర్దారులందరూ చార్మినార్ సిగరెట్లే తాగాలనీ, ఖరీదు గల బట్టలు కుట్టించుకోగూడదనీ, ఎవ్వరూ విలాసార్థం జాగీరు దాటి బయటకువెళ్ళి డబ్బు ఖర్చుపెట్టగూడదనీ ఒక ఫర్మానా కూడా దయచేయించారు. ఇటువంటి విషయాలు చాలా విన్నాడు శాస్త్రి. కాని మహమ్మదలీ సాహేబుగారి తండ్రి గారు కోమట్ల పిల్లవాడని వినటం అప్పుడే. అదీ వారి కుమారుని నోటి నుంచి వినేటప్పటికి నిర్వీణ్ణుడయ్యాడు.

''అది సంభవమా హుజూర్?'' అని అడిగాడు. నిజంగా హుజూర్ వారిని అలా అడగకూడదు. కొత్తగనక ధైర్యం చేసి అడిగాడు శాస్త్రి.

''ఏది?''

''మీ తండ్రిగారి జనన వృత్తాంతం''

''జనానా సంగతి మీకు తెలియదు శాస్త్రీజీ. మీ ఆచారాలకు మా ఆచారాలకూ చాలా తేడా ఉంటుంది. ఇప్పుడు నా జనానాలో వందవంది స్త్రీలున్నారు. అందరూ వయస్సులో ఉన్న వారే. వారందరూ ఏం చేస్తున్నదీ, అసలు జనానాలో ఏం జరుగుతున్నదీ నాకు తెలుస్తుందంటావా? ఈ తెలుసుకోటానికి నేను ఎవ్వరిమీదో ఒకరిమీద ఆధారపడాలి. అతడు నిజం చెపుతాడని నమ్మకం ఏముంది? తన వ్యక్తిగత ద్వేషం తీర్చుకోవటానికి ఎవ్వరిమీదో ఒకరిమీద కల్పించి అబద్ధాలు చెప్పవచ్చు. నిజం సునాయాసంగా కప్పిపుచ్చవచ్చు. అబద్ధాన్ని నిజంగా ప్రదర్శించవచ్చు. అంతేనంటావా శాస్త్రీజీ?'' అన్నాడు మహమ్మదలీ సాహేబు గారు.

శాస్త్రి ఏం చెప్పగలడు? ''కొంతవరకు హుజూర్'' అన్నాడు.

''ఇక మా బేగం సాహేబాల సంగతి. మీలో భార్యాభర్తలు కలిసి ఉన్నట్లు మేం ఉండం, ఉండటానికి వీల్లేదు. అడ్డుకునేవి ఏమిటంటావా? ధనమదాంధతే కావచ్చు. కారణం ఏదయినా కలిసి ఉండం అనేది సత్యం. మేము ఒక భవనంలో ఉంటాం, బేగం సాహేబాలు మరొక భవనంలో ఉంటారు. మేము వారి దగ్గరకు వెళ్ళాలంటే

ముందుగా కబురుపెట్టాలి. ఏ కారణంవల్లయినా బేగం సాహేబాలు 'వలదు పడదూ' అంటే ఊరుకోవలసిందే. ఇక అక్కడ ఏం జరుగుతున్నదీ మాకెలా తెలుస్తుంది? బేగం సాహేబాలకు, వారికి ఉండే పరివారం వారికి ఉంటుంది. ఇక ఆ పరివారంలో ఎవ్వరిమీదో ఆధార పడవలసి వస్తుంది. వారు నిజం చెపుతారనే నమ్మకం ఏముంది?

''బేగం సాహేబా గారికి నెల తప్పింది అంటారు. పెద్ద పెట్టున ఉత్సవం జరుగుతుంది. నిజమే అనుకుంటాం. పోనీ, నిజమే అన్నట్లు నటిస్తాం.

బేగం సాహేబాగారు ప్రసవించింది అంటారు. మొదటిసారికంటే పదిరెట్లు వైభవంగా ఉత్సవం జరుగుతుంది.సరే అనుకుంటాం. పోనీ, అనుకున్నట్లు నటిస్తాం.

ఏ డాక్టరునైనా పంపి నిజానిజాలు తెలుసుకుందాం అంటే, ఆ డాక్టరునిజం చెపుతాడని నమ్మకం ఏముంది? ఆ డాక్టరు మీద మరొక వేగులవాణ్ణి వెయ్యాలి. ఆ వేగుల వాడు నిజం చెపుతాడని నమ్మకం ఏముంది? వాణ్ణి కని పెట్టి ఉండమని మరొకణ్ణి పురమాయించాలి. ఇలా ఒక పెద్ద గొలుసు తయారవుతుంది. గొలుసు పెద్దదయిన కొద్దీ, సత్యం దూరం అవుతూ ఉంటుంది. ఇంత గొలుసు తయారుచేసికొని మేం ఎక్కడ ఉంటాం? యథాస్థానంలోనే ఉంటాం. ఎవ్వరినో ఒకర్ని నమ్మవల సిన స్థితిలోనే ఉంటాం. ఇక వృథా శ్రమ ఎందుకు? బేగం సాహేబాగారి మాటే నమ్మితే పోలా?''

''బాగా సెలవిచ్చారు హుజూర్?'' అన్నాడు శాస్త్రి దిక్కులు చూస్తూ.

''అందుకని మా తాతగారు బేగం సాహేబాగారి మాట నమ్మి ఉంటారు''

'పోనీ, నమ్మినట్లు నటించి ఉంటారు' అని మనస్సులో అనుకున్నాడు శాస్త్రి. పైకి అనే ధైర్యంలేక మెదలకుండా కూర్చున్నాడు.

అతని మౌనం అపార్థం చేసుకొని,''జాగీర్దారు కుటుం బాలంటేమీరు ఏమేమిటో ఊహించుకుంటారు. విష పూరిత వాతావరణం తప్ప ఏముంటుందిక్కడ? విష పూరిత వాతావరణంలో ఉంటూ ఎవ్వరికి వాళ్ళం నేర్పుగా బ్రతకటమే మేము చేసే పని'' అన్నారు.

ఈ విధంగా మహమ్మదలీ సాహేబుగారు అనేక విషయాలు చెపుతూ ఉండేవారు శాస్త్రికి.

❖ ❖ ❖

శాస్త్ర వయస్సు మళ్ళిన వాడవటం వల్లా, సద్బ్రాహ్మణు డవటం వల్లా, శాస్త్రి అంటే మంచి నమ్మకం కుదిరింది మహమ్మదలీ సాహేబుగారికి. పోనీ కుదిరిందని శాస్త్రి అనుకున్నాడు. దానికి కారణాలు ఉన్నాయి. మామూ లుగా జనానాలోకి ఏ పురుషుణ్ణీ వెళ్ళనివ్వరు. అటువం టిది శాస్త్రి ఎప్పుడుపడితే అప్పుడు వెళ్ళటానికి వీలుగా సాహేబ్‌గారు హుకుం దయచేశారు.

ఎప్పుడుపడితే అప్పుడు,ఎక్కడికి పడితే అక్కడకు అతను వెళ్ళవచ్చు, రావచ్చు. ఎవ్వరూ ప్రశ్నించటానికి వీల్లేదు. తన కింద పనిచేసేవారెవ్వరూ మహమ్మదలీ సాహేబుగారిని నేరుగా చూడటానికి వీల్లేదు. ముందుగా మేనేజరుతో చెప్పుకొని, వారి ద్వారా పర్మిషన్ తెచ్చుకొని చూడాలి. ఇటువంటి నిబంధనలు శాస్త్రికి వర్తించేవి కావు. శాస్త్రి ఎప్పుడుపడితే అప్పుడు హుజూర్‌ని చూడవచ్చు. ఆయనకు ఏ అడ్డూలేదు.

జరిగినన్నాళ్ళూ ఈ ఉద్యోగం బాగానే ఉంది శాస్త్రికి. సాయంకాలం ఆరుగంటల వరకూ సొంత పనులు ఏమన్నావుంటే చూసుకొని హుజూర్ దగ్గరకు వెళ్ళేవాడు. తొమ్మిది గంటలకు తిరిగి వచ్చేవాడు. ఒకటవ తారీఖు వచ్చేటప్పటికి వంద రూపాయలు ఇంటికి వచ్చేవి. ఇదే కాకుండా ఎక్కడికన్నా వెళ్ళదలిస్తే ముందుగా హుజూర్‌కి నివేదించుకునేవాడు. హుజూర్ మరునాడు ఫలానా గంట లకు రమ్మని చెప్పి, మేనేజరు ద్వారా ఖర్చులు ఇప్పించే వాడు. పండగలకూ, పబ్బాలకూ ఉప్పు, పప్పు ఇంటికి వస్తూ ఉండేవి. అప్పటికేచాలా కష్టాలు పడి ఉన్నాడేమో జీవితాంతం వరకూ ఇలా జరిగితే చాలు అనుకున్నాడు. శాస్త్రికి మహమ్మదలీ తండ్రిగారు ఎప్పుడు కోపం వచ్చి తాము కుమారుని ఇస్తున్న డబ్బు ఆపివేస్తారో, ఎప్పుడు జాగీర్లు రద్దయిపోతవో అనే భయం ఒకటి వెన్నాడుతూ ఉండేది. ఈ రెంటిలో ఏది జరిగినా మహమ్మదలీ సాహేబుగారికి తనలాంటి ఉద్యోగస్తులను తగ్గించక తప్పదని అతనికి తెలుసు.

''హుజూర్ ఉన్నారా?'' అని అడిగాడు శాస్త్రి ఒకరోజు గేట్లో కాపలా కాస్తున్న పహారా వాణ్ణి.

ఆ పహారావాడు సలాంపెట్టి,''లేదు శాస్త్రీజీ! తండ్రిగారి హుకుం అయితే చూట్టానికి వెళ్ళారు'' అని చెప్పాడు.

శాస్త్రి తన గదిలోకి వెళ్ళి కూచున్నాడు. ఏమీ తోచక మృదంగం బయటకు తీసి శృతిపెడుతూ కూర్చున్నాడు.

''శాస్త్రీజీ!'' అని పిలుపు చేరువగా వినిపించేటప్పటికి ఉలిక్కిపడి చూశాడు శాస్త్రి.

మనోహరి. మనోహరి అసలే అందగత్తె, అందులో

చక్కగా ముస్తాబై ఉంది. ధగధగ మెరిసిపోతూ ఉంది.

"ఇవ్వాళ మీ మృదంగం తీరిగ్గా విందామని వచ్చాను" అన్నది.

"మృదంగం కన్డీషన్లో ఉన్నట్లు లేదు" అన్నాడు శాస్త్రి కాస్త తడబడుతూ.

"మీ వ్రేళ్ళు కన్డీషన్లో ఉన్నాయి గదా, అదే చాలు" అని అపహాస్యం చేసింది మనోహరి. "అవే చాలు" అని దిద్దుకుంది.

శాస్త్రికి తప్పలేదు. "ఏం వాయించమంటారు?" అని అడిగాడు.

"ఖైర్వా వరుస"

శాస్త్రి కొంచెం పస్తాయించాడు. ఆ వరుస ప్రభావం అతనికి తెలుసు. ఆ వరుస మొగవాళ్ళకంటే ఆడవాళ్ళని ఎక్కువగా ఉద్రేకపరుస్తుందనేది అతని అనుభవంలో సంగతి. ఆ వరుస వాయించినప్పుడే ఆమె తలుపు దగ్గర ఉండి వింటూ ఉండేదనే సంగతి అతను మరచిపోలేదు.

"సంకోచిస్తారేం. శాస్త్రీజీ!"

శాస్త్రి మొదలుపెట్టాడు. మొదలుపెట్టినప్పుడు సంకోచమే గాని తరువాత తన్ను తాను మరిచాడు. ఖైర్వా వరుస వినేవాళ్ళనే కాదు, వాయించేవాళ్ళని కూడా ఉద్రేకపరుస్తుందని తెలిసీ తన్ను తాను సంబాళించుకోలేకపోయాడు. గతి తరువాత గతి వయించుకుంటూ పోతున్నాడు. మనోహరి ఆనందంలో తేలిపోతూ ఉంది.

బయట వానచినుకులు పడుతున్నాయి. జనానాలోంచి కిలకిల నవ్వులు వినిపిస్తున్నాయి. మనోహరి శరీరం ఒక్కసారి సువాసనలను విరజిమ్మింది. ఆమె లేత నడుము త్రాచుపాముకు మల్లే లయబద్ధంగా మెలితిరుగ నారంభించింది.ఎటుపడితేఅటు విల్లుకుమల్లే ఒంగుతూ ఉంది. నడుంమీద గుడ్డపీలికన్నా లేదు. బొడ్డు తన లోతులను ప్రదర్శిస్తూ వ్యామోహ వీచికలను రేకెత్తిస్తూ ఉంది.

శాస్త్రి దురితస్థాయిని అందుకున్నాడు. ఒళ్ళు మరచి వాయించాడు. అతని చేతిలో మృదంగం శివుని చేతిలోని ఢమరుకవలె మ్రోగింది. మనోహరి దురితస్థాయిని అందుకుంది. ఒళ్ళు మరచి నృత్యం చేసింది. ఆమె శరీరం శ్రీరామచంద్రునిచే మీటబడిన వింటినారి వలె పడగలెత్తింది. చివరికి ఆమె అతని చేతుల్లో వాలింది. అప్పుడుగాని శాస్త్రికి తెలివిరాలేదు. తెప్పరిల్లి తను చేసిన పొరపాటు గ్రహించి, "ఏమిటిది మనోహరీ?" అన్నాడు.

"ఏమున్నది? మీరు చొక్కా తీసివేసి మృదంగం వాయిస్తే ఒక్కసారి చూడాలని ఉన్నది" అన్నది.

శాస్త్రి పై పంచె భుజాన వేసుకొని గది బయటకునడిచాడు. వెనుక నుంచి మనోహరి కిలకిల నవ్వులు వినిస్తూ ఉన్నాయి. "శాస్త్రీజీ" అని పిలుస్తూ.

అతనికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఏం చేసేటట్టు? మనోహరి అంటే మహమ్మదలీ సాహేబుగారికి చాలా ఇష్టం. మొత్తం జనానాలో ఉన్న యువతులందరి మీదకంటే, ఆమెమీదే ఆయనకు ఎక్కువ మోజు. ఈ సంగతి అందరికీ తెలుసు. హతాశ అయిన మనోహరి తనమీద ఏమేమి కొండేలు చెపుతుందో! మహమ్మదలీ గారికి కోపం వస్తే ఎంత కఠినంగానైనా ప్రవర్తించగలరని అతనికి తెలుసు. తన గతి ఏం కానున్నదో?

పదిరోజులు కొలువుకు సెలవుపెడితే తన అపరాధం రూఢి అవుతుందేమోనని భయం వేసింది. రెపరెపకొట్టుకుంటున్న మనస్సును చిక్కబట్టి అలాగే కొలువుకు వెళ్ళాడు. వారం రోజుల వరకు అంతా మామూలుగానే జరిగింది. మహ్మదలీ సాహేబుగారు తనతో వేదాంత చర్చలు చేస్తూనే ఉన్నారు. తమ కుటుంబ పరిస్థితులు చెపుతూనే ఉన్నారు.

"మొన్న తండ్రిగారు నన్నెందుకు పిలిపించారో తెలుసా శాస్త్రీజీ?"

"సెలవియ్యండి హుజూర్!" అని నసిగాడు శాస్త్రి.

"మామూలు పాటే శాస్త్రీజీ. ఖర్చు తగ్గించుకోమన్నారు"

"తమరేమన్నారు హుజూర్?"

"మామూలు పాటే శాస్త్రీజీ. వీల్లేదన్నాను. నా స్వంత ఖర్చులు తగ్గించుకుంటానన్నాను. పరివారాన్ని మాత్రం తగ్గించడానికి వీల్లేదన్నాను. తగ్గించి ఇంటికి పంపితే వాళ్ళ జీవనోపాధి ఎలా అని అడిగాను. ఇన్నాళ్ళూ, మనలను కనిపెట్టుకొని ఉన్న వాళ్ళను వీధుల్లోకి తోలటం, వాళ్ళు తిండిలేక అలమటిస్తూ ఉంటే పట్టనట్లు చూస్తూ ఊరుకోవటం మన వంశానికి శ్రేయస్కరం కాదు అన్నాను. ఎన్నడూనేను వారి మాటకు ఎదురు చెప్పలేదు శాస్త్రీజీ. ఆనాడు మాత్రంమాటకు మాట అనేశాను" అన్నాడు సంతోషంగా భుజాలు తాటిస్తూ.

"తండిగారు ఏమన్నారు హుజూర్?"

"నేను చెప్పిందంతా శ్రద్ధగా విని, తగ్గించక తప్పదు అన్నారు. అప్పుడు నేనేమన్నాననుకున్నావు శాస్త్రీజీ?"

"ఏమన్నారు హుజూర్?"

"ఇది కోమట్లు చెయ్యవలసిన పని. మహమ్మదలీ వంశానికి చెందిన సుల్తానులు చెయ్యవలసిన పనికాదు అన్నాను. దాంతో శాస్త్రీజీ! తండ్రిగారు నిర్విణ్ణుడై కూర్చుని పోయారంటే నా మాట నమ్ము, ఆపట్న నేను

వచ్చేశాను''

శాస్త్రికి అసలే భయంగా ఉంది, ఏ మాటంటే ఏమవుతుందో అని. ''చిత్తం హుజూర్'' అని ఊరుకున్నాడు.

మహమ్మదలీ సాహేబుగారు, కూర్చున్నవారు కూర్చున్నట్లుగా దిగ్గున లేచి, ''ఇవ్వాళ నాకు చాలా ఉల్లాసంగా ఉంది శాస్త్రీజీ. ఖైర్వా వరుసలు వాయించు'' అన్నారు.

మామూలుగా శాస్త్రీజీ మృదంగం ప్రారంభించాడు. మామూలుగా వింటూ కూర్చున్నాడు హుజూర్. మామూలుగా తలుపు దగ్గరకు చేరింది మనోహరి. మనోహరి, జరిగిన విషయం ఏ రూపంలోనూ హుజూర్‌కి చెప్పలేదని నిశ్చయించుకొని మనస్సులో వందన శతాలపర్పించాడు శాస్త్రి.

కాని మరునాడు కొలువుకి రాగానే, మేనేజరు పిలిపించి తనకు ఖరారైన ఒక ఫిర్యాదు చూపించాడు శాస్త్రికి. అది శాస్త్రిమీద నీలకంఠశర్మ ఇచ్చిన ఫిర్యాదు. నీలకంఠశర్మ శాస్త్రికి ముందు హుజూర్ వారికి సన్నిహితంగా ఉంటున్న ఉద్యోగి. శాస్త్రి వచ్చిన తరువాత హుజూర్ వారి దగ్గర తన ప్రాముఖ్యత తగ్గిందని శాస్త్రిమీద కక్షగట్టి ఉన్నటువంటివాడు. శాస్త్రికి మనోహరికీ మధ్య జరిగిన సంగతి ఆయనకు ఎట్లా తెలిసిందో, చిలవలు పలవలుగా వర్ణించి మేనేజరుకి ఒక ఫిర్యాదు రాసి ఇచ్చాడు. తారీఖు ఉదహరించి ఆనాడు శాస్త్రీ మనోహరీ మాంసం తిని, మద్యం తాగి, క్రీడించారని ఆ ఫిర్యాదు సారాంశం.

అది చదువుకొని శాస్త్రి ఒణికిపోయాడు. ''ఒట్టిది హుజూర్ ఒట్టిది. గాయత్రి పట్టుకు చెపుతున్నాను'' అన్నాడు.

''ఒట్టిదే. ఆ సంగతి నాకూ తెలుసు. మనోహరికి కావలసి వస్తే బక్క బ్రాహ్మడివి నీకంటే ఎవ్వరూ దొరక్కపోయారా? కాని హుజూరు వారి వద్ద ఒట్టిదని నిరూపించటం ఎలా? వారు ఒట్టిది అనుకుంటే ఒట్టిది, గట్టిది అనుకుంటే గట్టిది. అందులో వారికి మనోహరి అంటే ఇష్టం. ఏమి కానున్నదో ఏమో! నిన్ను ప్రవేశపెట్టినందుకు ఈ పాపం నామీద విరుచుకుపడుతుందో ఏం ఖర్మో. ఏమన్నాగానీ ఈపూట హుజూర్ వారికి ఈ కాగితం పంపించక తప్పదు. నువ్వెళ్ళి కనబడు'' అన్నాడు మేనేజరు.

శాస్త్రి గుండెల్లో రాయి పడింది.తన ఉద్యోగం ఊడినట్లే భావించాడు. శిక్షించటం అనేది వస్తే కొరడా దెబ్బలదాకా వెళ్ళవచ్చు. ఇటువంటి విషయాల్లో తను ఎన్ని చెప్పుకుంటే మాత్రం హుజూర్ మనస్సుకు ఎక్కుతుంది? ఏమీ తోచక అటూ ఇటూ తిరిగి ఎనిమిది గంటలకు వెళ్ళాడు, హుజూర్ దర్శనార్థం. అప్పటికి కాగితం హుజూర్ దగ్గరకు వెళ్ళి వుంటుందని అతనికి తెలుసు.

అతన్ని చూడగానే, ''రా శాస్త్రీజీ'' అన్నారు మహమ్మదలీ సాహేబు గారు.

''హిందూ అవతారాలన్నిటిలోకి నాకు శ్రీకృష్ణ పరమాత్మ బాగా నచ్చాడు శాస్త్రీజీ'' అన్నారు.

''చిత్తం హుజూర్, వారు సాక్షాత్తూ భగవంతులు'' అన్నాడు శాస్త్రి.

''నువ్వు పొరపాటు పడుతున్నావు శాస్త్రీజీ. అందరూ అవతారమూర్తులకు వలె వారిలోనూ భగవదంశ ఎక్కువా ఉంది. అంతే. వారు రక్తిలోనే విరక్తిని చూశారు. రక్తిని వొదులుకొని కాదు, రక్తి ద్వారానూ కాదు. రక్తిపట్ల ఉండే వ్యామోహాన్ని రద్దు చేసుకోవటానికి రక్తిని అలవాటు చేసుకోవటమే ఉత్తమ మార్గమని శ్రీకృష్ణ పరమాత్మ జీవితం హెచ్చరిస్తూ ఉంది. ఏమంటావు శాస్త్రీజీ?'' అన్నారు మహమ్మదలీ సాహేబు గారు.

శాస్త్రి ఏమంటాడు? హుజూర్ ఈ విషయం ఎందుకు ప్రస్తావిస్తున్నదీ తెలియక తికమకపడుతూ చేతులు జోడించి నిలబడ్డాడు. తన సంగతి కాదుగదా! తన్ను ఎత్తి పొడవటం లేదుగదా!

ఏదయినా అడగ్గానే ఏదో ఒక సమాధానం చెప్పకపోతే హుజూర్‌కి కోపం వస్తుంది. అందుకని, ''తమరు చెప్పిన విధంగా కాకపోతే శ్రీకృష్ణ పరమాత్మ పదహారువేలమంది గోపికలతో ఉండటానికి అర్థం చెప్పుకోలేం హుజూర్'' అన్నాడు.

''సెహబాష్ శాస్త్రీజీ, బాగా చెప్పావు. నేను చెప్పిన మాట స్వానుభవంమీద చెప్పిన మాట శాస్త్రీజీ. నాకీనాడు ఏ స్త్రీమీదా వ్యామోహం లేదంటే,నాకున్న జనానాయే కారణం.నాకిప్పుడు స్త్రీమీదే కాదు, అభిజాత్యం మీదా వ్యామోహం లేదు. వ్యామోహం అనేది అందని వస్తువుమీద ఉంటుంది. గోప్యంగా ఉండే వస్తువుమీద ఉంటుంది. ఆ వ్యామోహం పోగొట్టుకోటానికి ఆయా వస్తువులను లభ్యపరచుకోవటమే ఉత్తమ మార్గం'' అన్నారు మహమ్మదలీ సాహేబుగారు.

''చిత్తం హుజూర్'' అని గొణిగాడు శాస్త్రి.

అంతలో మహ్మదలీ సాహేబుగారు ఆలోచనలో పడిపోయారు. మాట్లాడుతూ, మాట్లాడుతూ నిద్రపోవటం, ఆలోచనలో పడిపోవటం వారికి మామూలే.వారికి అసలు విషయం ప్రస్తావించే అవకాశం లేదని గ్రహించాడు శాస్త్రి. లోపల వేదన సుళ్ళుకట్టి తిరుగుతూ ఉంది. భరించటం అతనికి అశక్యమైంది. తనకు తానుగానే కదిలించి హుజూర్ మనస్సును తెలుసుకోవాలనుకున్నాడు. కాలం

గడిచినకొద్దీ సాక్ష్యాలూ, మరికొన్ని అపవాదులూ హుజూర్ వారి చెవిని పడటం జరుగుతుందని అతనికి తెలుసు. అతనికి భయం.

''హుజూర్, నామీద ఒక ఫిర్యాదు వచ్చిందని విన్నాను'' అన్నాడు వినయం ఉట్టిపడేటట్లు.

''అవును శాస్త్రీజీ! నువ్వు చేసిన పని ఏమంత మంచిది కాదు. అందులో మనోహరి అంటేనాకు మనస్సని నీకు తెలుసు గదా! విశ్వాసపాత్రులు చెయ్యవలసిన పని కాదిది'' అన్నారు మహమ్మదలీ సాహేబుగారు.

''నేనే పాపం ఎరుగను హుజూర్?'' కంట తడిపెట్టుకుంటూ చెప్పాడు శాస్త్రి.

''దీనికి నీమాటే గదా సాక్ష్యం శాస్త్రీజీ!''

''ఇటువంటి విషయాల్లో వేరు సాక్ష్యాలు ఏముంటాయ్ హుజూర్?''

''నీవే అపరాధివి, నీవే సాక్షివి. బాగుంది శాస్త్రీజీ, సర్వం ఆ పరబ్రహ్మ స్వరూపమే అని చెప్పటానికి మంచి తార్కాణం'' అని వెంటనే నీలకంఠ శర్మను పిలిపించారు.

''శర్మాజీ, ఈ ఫిర్యాదు చేసింది మీరేనా?''

''చిత్తం హుజూర్'' అన్నాడు శర్మ.

''ఇందులోని విషయాలు నిజమేనా శర్మాజీ?''

''అక్షరాలా నిజం, హుజూర్!''

''ఆనాడు శాస్త్రీజీ, మనోహరీ కలిసి మాంసం తిన్నారు, మద్యం త్రాగారు, క్రీడించారు. ఇదేగదూ నువ్వు చెప్పేది శర్మాజీ''

''అంతేకాదు హుజూర్, సర్కారువారు ప్రత్యేకంగా వాడుకునే అత్తర్లు వాడారు. సర్కారు వారు ప్రత్యేకంగా ధరించే పూలమాలలు ధరించారు''

''సరే'' అన్నారు మహమ్మదీ సాహేబుగారు. ఇక శాస్త్రిని ఏమీ అడగలేదు. శాస్త్రి పడబోయే పిడుగుకు బ్రద్దలవటానికి సిద్ధపడుతున్నాడు. మహమ్మదలీ సాహేబుగారు జనానా హెడ్ నౌకరును పిలిపించారు.

''మనోహరి ఎక్కడుంది?'' అని అడిగారు.

''ఆమె గదిలోనే ఉంది సర్కార్'' అన్నాడు హెడ్ నౌకరు.

''ఆమె గదిలోకి నేను తినే మాంసం,నేను త్రాగే మద్యం తీసుకొని వెళ్ళి పెట్టు. ప్రతిదీ పుష్కలంగా ఉండాలి''

''చిత్తం హుజూర్!'' అని హెడ్ నౌకరు వెనుతిరిగాడు. వెనుతిరిగి అతన్ని మళ్ళీ పిలిచి, ''నేను వాడే అత్తర్లూ, పూల మాలలూ కూడా ఆమె గదిలోపెట్టు. ఆమెను చక్కగా అలంకరించుకొని ఉండమను'' అన్నారు మహమ్మదలీ గారు.

''చిత్తం హుజూర్'' అని వెళ్ళిపోయాడు హెడ్ నౌకరు.

''శాస్త్రీజీ!'' అని గద్దించి, ''నువ్వు తక్షణం మనోహరి గదికి వెళ్ళు. అక్కడ మాసం ఉంటుంది. మద్యం ఉంటుంది, అత్తర్లు ఉంటై, పూలమాలలు ఉంటై, ఆమె గదికి నేను వెళ్ళేటప్పుడు ఏమేమి ఉంటయ్యో అవన్నీ ఉంటై. ఆమె నన్ను ఆహ్వానించేటప్పుడు చేసుకునే అలంకారాలన్నీ చేసుకొని ఉంటుంది. ఆమె గదిలో ప్రవేశించి అక్కడ ఉన్న వస్తువులనన్నిటినీ సేవించి, అత్తరు పులుముకొని పూలమాలలు ధరించి, ఆమెపట్ల నేను ఆ సమయంలో ఏ విధంగా ప్రవర్తిస్తానో ఆవిధంగా ప్రవర్తించు, వెళ్ళు'' అన్నారు.

శాస్త్రి నిలువుగుడ్లు వేసి, ఒణికిపోతూ, ''హుజూర్'' అని ఏదో మనవి చేసుకోబోయాడు.

''ఇది నా హుకుం శాస్త్రీజీ'' అని గద్దించారు మహమ్మదలీ సాహేబుగారు.

శాస్త్రి గజగజ ఒణుకుతూ, అధోముఖుడై మనోహరి గదికి బయలుదేరాడు.

అతను అటు తిరగ్గానే మహమ్మదలీ సాహేబుగారు బిగ్గరగా నవ్వుతూ, ''ఇప్పుడేమంటావు శర్మాజీ'' అని అడిగాడు నీలకంఠశర్మని.

ఏమంటాడు నీలకంఠ శర్మ?

❖ ❖ ❖

ఇంతవరకు మహమ్మదలీ సాహేబుగారికి తమకూ ఉన్న పరిచయాన్ని నాకు చెప్పి, ''వారి దగ్గర చాలా మంచి లక్షణాలు ఉన్నాయి. వారికి కాకరకాయ వేపుడూ, కుమ్ములో పెట్టిన దోసకాయ పచ్చడి అంటే చాలా ఇష్టం. కావలసినప్పుడల్లా నన్ను అడుగుతుండేవారు. నేను మా ఆవిడతో వాటిని చక్కగా చేయించి తీసుకువెళ్తుండేవాణ్ణి'' అని కంటతడి పెట్టుకున్నారు వెంకటరమణశాస్త్రి.

కథంతా విన్న తరువాత, అతను కంట తడిపెట్టుకోవడంలో అర్థం ఉన్నదని నేను గ్రహించాను.కాని నాకు ఒక విషయం తెలుసుకోవాలని కుతూహలం కలిగింది.

''అయితే శాస్త్రీ, నువ్వు మనోహరి గదిలో ప్రవేశించి ఆమె పట్ల, మహమ్మదలీ సాహేబుగారు ప్రవర్తించినట్లు ప్రవర్తించావా?'' అని అడిగాను.

''తప్పేముంది? హుజూర్ వారి హుకుం అనుష్టించక పోతే ఉద్యోగం నిలుస్తుందా? పొట్ట గడుస్తుందా?'' అని సమాధానం చెప్పాడు శాస్త్రి.

చెప్పి తానింత పొడుం వ్రేళ్ళతో తీసుకొని, నాకు కొంచెం అందించి ఒక పట్టుపట్టమన్నాడు. తాను ఘాటుగా పీల్చి వ్రేళ్ళు విదిలించుకున్నాడు. ■